క్లుప్తంగా

పంటల సాగులో మెళకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మనుబోలు: రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మనుబోలులోని రైతుసేవా కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. త్వరలో రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, ఎరువులు, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని నేల స్వభావానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. చౌడుభూముల్లో చౌడును తట్టుకునే ఎంసీఎం-103 రకం వరిని సాగు చేయాలని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త ఎస్ లోకేష్, వీఏఏ శివ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్లకు దసరా సెలవుల్లో నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. బాలికా శిశు సంక్షేమాధికారి మమత, ఎంఈఓ మురళీధర్, ఏపీఓ ప్రసాద్, ఒకేషనల్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు గురుచరణ్



నెల్లూరు (టౌన్): గుంటూరులో 10 ఆంధ్రా నావల్ గ్రూపు కమాండర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ డే వేడుకలకు స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్ పెరంకొండ గురుచరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి గురుచరణ్‌కు పాఠశాల హెచ్‌ఎం మంజులవాణి, ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ నరేంద్రబాబు శనివారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలివ్వాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పెరమన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య డిమాండ్ చేశారు. గుర్రాలమడుగు సంఘం ప్రాంతానికి చెందిన బాలవెంగయ్య, సారమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను సీపీఐ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సిరాజ్, షాన్‌వాజ్, ఏఐటీయూసీ నాయకులు శంకర్‌కిశోర్, శేఖర్, ముక్తియార్, సుబ్బరాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్లలో వైద్య శిబిరం

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో వైద్యాధికారులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, యూసఫ్ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వైద్యసేవలు అందించడం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం మహిళలకు గుండె, మధుమేహం, రక్తపోటు, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.పెంచలయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఘనం..వసతులు శూన్యం

- కసుమూరు మస్తాన్‌వలీ గంధోత్సవ ఏర్పాట్లలో వైఫల్యం
- ఈఓ నియంతృత్వ పోకడలతో దర్గాలో కానరాని వసతులు
- ఇబ్బందులు పడిన భక్తులు
- మండలాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు



టెంట్లు ఏర్పాటు చేయక బురదలోనే సేదతీరుతున్న భక్తులు



దర్గాకు వెళ్లే ప్రధాన వీధిలో అధ్వానంగా పారిశుధ్యం

వెంకటాచలం: దక్షిణ భారత దేశంలో ఎంతో ప్రసిద్ధి చెందిన వెంకటాచలం మండలం కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గాలో 248వ గంధ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. గురువారం నుంచి శనివారం వరకు మూడ్రోజుల పాటు జరిగిన గంధ మహోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అయితే భక్తులకు తగిన విధంగా వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంధోత్సవాలకు ముందుగా ఏర్పాట్లపై మండలాధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఏటా ఉత్సవాల ప్రారంభానికి ఒక్కరోజు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేవారు. కానీ ఈ ఏడాది వక్ఫ్‌బోర్డు కేటాయించిన రూ.16లక్షల్లో 50శాతం కూడా ఏర్పాట్లు ఖర్చు చేయలేదని గ్రామస్తులు, భక్తులు చెబుతున్నారు. ఈ కారణంగా దర్గా ఈఓ కార్యాలయం, దర్గా, చందన్‌మహల్ ప్రాంగణాల వద్దనే పారిశుధ్యం అత్యంత దారుణంగా కనిపించింది. మొబైల్ టాయిలెట్లను అలంకార ప్రాయంగా ఏర్పాటు చేశారు. వాటిలో నీటి వసతి కల్పించకపోవడంతో భక్తులు ఉపయోగించలేదు. విద్యుద్దీపాలంకరణ సక్రమంగా చేయకపోవడంతో చందన్‌మహల్ వద్ద అంధకారం నెలకొంది. ఏటా గంధ మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో చేసేవారు. కానీ ఈ ఏడాది మార్చిలో దర్గా ఈఓగా నియమితులైన షరీఫ్ అన్నీ తానై వ్యవహరించి ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం చెందారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తన నియంతృత్వ పోకడలతో 50 శాతం నిధులు కూడా ఖర్చు చేయకపోవడంతో వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారని స్థానికులు చెబుతున్నారు.

వసతులు కల్పించకపోవడంపై ఉన్నతాధికారుల ఆరా

కసుమూరు దర్గా గంధ మహోత్సవాలకు ఏర్పాట్లు సక్రమంగా చేయలేదనే విషయంపై పత్రికలు, టీవీ చానళ్లలో గత రెండ్రోజుల నుంచి కథనాలు వచ్చాయి. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ మండలాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పవిత్రమైన కసుమూరు దర్గా గంధోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు సక్రమంగా చేయకుండా ఉంటే తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించినట్లు సమాచారం. ఉత్సవాల ఏర్పాట్లలో నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరో నివేదిక పంపాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు.

ప్రసన్న పరామర్శ



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఇస్కపాళేనికి చెందిన కోడూరు మధుసూదన్‌రెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీఎస్ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న నేపథ్యంలో కోడూరును పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలాగే సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మేనకూరు సీతారామిరెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం రూరల్, టౌన్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, షేక్ షాహుల్, సీనియర్ నాయకుడు కలువ బాలశంకర్‌రెడ్డి, నగర పంచాయతీ యవజన విభాగం అధ్యక్షుడు బట్టా విల్సన్, కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ కేసులతో వేధించడం దుర్మార్గం

కోవూరు : డీసీఎమ్మెస్ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావుపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని నివాసంలో వీరి చలపతిరావును శనివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అక్రమాలు, అరాచకాలపై గొంతువిప్పుతున్న వీరి చలపతిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి కుట్రలు పన్నడం దారుణమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా వెనుకడుగు వేసేది లేదన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడుతామన్నారు. వీరి చలపతిరావుకు అండగా నిలబడతామన్నారు. వైఎస్సార్‌సీపీ కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి మందా రవి, మండల రైతు విభాగం అధ్యక్షుడు కలికి శ్రీధర్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు చెంచురెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, సీనియర్ నాయకులు ఆదినారాయణరెడ్డి, మోషే, జనార్దన్, వెంకటరమణారెడ్డి, శ్రీనురెడ్డి, శివకుమార్‌రెడ్డి, సందీప్, కిషోర్‌రెడ్డి, హరి, వార్డు సభ్యులు శ్రీనివాసులు, చక్రి, బుడంగుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వీరి చలపతిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీవారికి పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం దేవదేవేరులకు విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ జరిపారు. స్వామివారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తోటపల్లిగూడూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంఎస్ఎస్ మండలాధ్యక్షుడు కంజి సుధాకర్ అన్నారు. మండలంలోని కాటేపల్లి సముద్ర తీరంలో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంఎస్ఎస్, ఫిషరీష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తీరం వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కంజి సుధాకర్ మాట్లాడుతూ సముద్ర జలాల కలుషితంతో సముద్రజీవులు మృత్యువాత పడి జీవసమతుల్యత దెబ్బతింటుందన్నారు సముద్ర జలాలు కలుషితం కాకుండా తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. తీరంలో సేదతీరేందుకు వచ్చే పర్యాటకులు చెత్తను తీరం వెంబడి పడేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముత్తుకూరు ఎఫ్‌డీఓ స్టీఫెన్, ఫిషరీష్ సిబ్బంది సౌజన్య, విజయలక్ష్మి, జయశ్రీ, రంజిత్, సురేష్, బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్, నాయకులు మోహన్‌బాబు, హేమంత్ గౌడ్, శ్రీనివాస్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కొడవలూరు: 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన గండవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు హిందీ పండిట్ జీ నాగభూషణం శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. హిందీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు సుచిత్ర, జస్వంత్, ప్రదీప్‌కు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 వంతున నగదును అందజేశారు. అలాగే పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బైనా లక్ష్మీకాంతం మాట్లాడుతూ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసిన హిందీ పండిట్‌ను అభినందించారు. హిందీ పండిట్ నాగభూషణం మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో హిందీలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు కృష్ణయ్య, వీబీ శ్యామ్, పవన్‌ప్రసాద్, ఖాజాహుస్సేన్, రంజానమ్మ, శివనాగబాబు, మాధవి, హసీనా పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మునులపూడి పంచాయతీ పరిధిలోని బట్టేపాడుదిన్నె ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు బీజేపీ నాయకులు శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. తొలుత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ వరకు బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు వివరించారు. నాయకులు సిద్దన మనోహర్, రఘురామిరెడ్డి, గంజం పెంచలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై నిరసన

ముత్తుకూరు(పొదలకూరు) : ముత్తుకూరు మండలం సీతారెడ్డితోపు గ్రామస్తులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య మాట్లాడుతూ గ్రామస్తులు 70 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నారని, ప్రభుత్వం పట్టాలను సైతం అందజేసిందని తెలిపారు. అయితే ఇప్పటి వరకు వారి పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. రెవెన్యూ అధికారులు చొరవచూపి భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐకు వినతిపత్రాన్ని అందజేశారు.



కార్మికులను బానిసలుగా మార్చిన కేంద్ర ప్రభుత్వం

పొదలకూరు : బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులను పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ 8వ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేసిందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలు వ్యతిరేకించినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నిప్పట్లపల్లి గౌరయ్య, కోకన్వీనర్‌గా పంచాయతీ శ్రీనివాసులు, 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



జెన్‌కో గేటు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ముత్తుకూరు(పొదలకూరు) : ఏపీ జెన్‌కోలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ గోడా భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జెన్‌కో మెయిన్ గేట్ ఎదుట కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 23,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సంస్థలో విలీనం చేసుకుని నేరుగా చెల్లింపులు జరపాలని కోరారు. 2022 నాటి పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు చీకిరి ఆదిశేషయ్య మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన కార్మికులకు పరిహారం చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. గౌరవాధ్యక్షుడు స్వర్ణ రమణరావు, నాయకులు నాగరాజు, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సునీల్, శివ, అనీల్, శ్యాంప్రసాద్, శేఖర్, కోటేశ్వరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



పొదలకూరు : పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో సీజనల్ వ్యాధులపై వైద్యాఆరోగ్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్నట్లుగా గుర్తించి కాచి చల్లార్చిన నీటిని సేవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, సుమాంజలి, ఆశార్కర్లు సీత, ఉష, లక్ష్మి పాల్గొన్నారు.

మొక్కల పెంపకం లక్ష్యం కావాలి



బుచ్చిరెడ్డిపాళెంలో గ్రీన్ ఏపీ ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై అవగాహన ర్యాలీని శనివారం చేపట్టారు. ఈ ర్యాలీలో చైర్‌పర్సన్ సుప్రజతో కలిసి కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల విస్తీర్ణం రోజురోజుకు తగ్గిపోతుందని, అడవులు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అడవుల విస్తీర్ణం పెంచితే వాతావరణంలో మార్పులు జరగవన్నారు. వర్షాకాలంలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే అడవుల విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమన్నారు. నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజలేదనన్నారు. మున్సిపల్ సిబ్బందికి చెత్త అందించి సహకరించాలని కోరారు. వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, చీర్ల ప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరులో మొక్కలు నాటుతున్న డీపీఓ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కోవూరు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డీపీఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ విజయమ్మ, ఎంపీడీఓ శ్రీహరి, వార్డు సభ్యులు అశోక్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బూడిదగుమ్మడి విక్రయాలు

పొదలకూరు : పట్టణంలో శనివారం బూడిదగుమ్మడి కాయల విక్రయాలు జోరుగా సాగాయి. ఆదివారం మహాలయ అమావాస్య కావడంతో ప్రజలు తమ ఇళ్లు, దుకాణాల ముందు దిష్టి తీసేందుకు బూడిద గుమ్మడి కాయలను కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. అయితే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు కాయల ధరలను పెంచేశారు. రైతుల వద్ద నుంచి కిలో రూ.10కు కొనుగోలు చేసి రూ.30వంతున విక్రయించారు. దీంతో నాలుగు కిలోల కాయ ధర రూ.120కుపైగా పలకడంతో చాలా మంది కొనుగోలు చేసేందుకు వెనుకడుగు వేశారు. బూడిద గుమ్మడి కాయలకు ఉన్న డిమాండ్‌ను గుర్తించిన కలువాయి మండలం దాచూరుకు చెందిన కొందరు రైతులు నేరుగా తమ ట్రాక్టర్లలో పొదలకూరుకు తీసుకొచ్చి కిలో రూ.15 వంతున అమ్మకాలు సాగించారు. ధర అందుబాటులో ఉడడంతో కాయలను కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రజలు ఎగబడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న వ్యాపారులు వెంటనే ధరలను తగ్గించేశారు. అప్పటికే చాలామంది నేరుగా అమ్మకాలు సాగిస్తున్న రైతుల వద్ద నుంచే కాయలను కొనుగోలు చేశారు. విజయ దశమి నాడు నేరుగా వచ్చి విక్రయిస్తామని బూడిద గుమ్మడి కాయలను పండిస్తున్న రైతులు వెల్లడించారు. కాయలు చేతులు మారితే 50 శాతం ధరను అదనంగా చెల్లించాల్సి రావడం గమనించిన వినియోగదారులు నివ్వెరపోయారు.



గుమ్మడికాయలను అమ్ముతున్న రైతు

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి వినతి



కొడవలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు మండల తహసీల్దార్ కే స్ఫూర్తిరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏలకు పే స్కేల్‌ను అమలు చేయాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, అర్హత కలిగిన వారికి డ్రైవర్లుగా, అటెండర్లుగా, వాచ్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ వీఆర్ఏల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్వో సంఘ నాయకులు

నెల్లూరురూరల్: నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి దారా రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, వీఆర్వోలు జగదీష్, రాజేశ్వరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



పూలమొక్కను అందజేస్తున్న సంఘ నాయకులు

పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన అవసరం



కొడవలూరు: పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం డీ ఓబులేసు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో పరిశుభ్రతపై శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తాచెదారాలను ఎక్కడ బడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలో వేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ నాగభూషణమ్మ మాట్లాడుతూ భోజనానికి ముందు, తరువాత విధిగా చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలు వై.రాజమ్మ, ఎస్.సుదర్శన, ఆశాకార్యకర్త జీ శోభ పాల్గొన్నారు.